క్లుప్తంగా

అగ్నాస్త్రంతో చీడపీడల నివారణ



అగ్నాస్త్రం తయారీని వివరిస్తున్న రమాదేవి

రాజాం: చీడపీడల నివారణకు అగ్నాస్త్రం, జిల్లేడు ద్రావణం, ఘన, ద్రవ జీవామృతాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రకృతి వ్యవసాయం గార్రాజు చీపురుపల్లి యూనిట్ ఇన్‌చార్జ్ రమాదేవి అన్నారు. మండలంలోని బొమ్మినాయుడువలసలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి పంటలో దోమపోటు, కుళ్ల తెగులు, కాండం తొలిచే పురుగు నివారణకు జీవామృతాలు బాగా పని చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రావణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్ను చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

రాజాం: పట్టణంలో ప్రజలతో పాటు వ్యాపారులు తమ షాపులు, ఇళ్లకు సంబధించిన మున్సిపాలిటీ పన్నులు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న షాపులతో పాటు మాధవబజార్‌లో వ్యాపారులతో బుధవారం మాట్లాడారు. బకాయిపడిన పన్నులు వెంటనే చెల్లించి, వడ్డీ రాయితీలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చక్రవర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు...

తెర్లాం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర, సాంకేతిక సహాయకులతో గృహ నిర్మాణాల బిల్లుల చెల్లింపులు, పనిదినాల కల్పనపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో పంచాయతీకి సంబంధించి ఎన్ని గృహాలు మంజూరయ్యాయి, ఇళ్లు మంజూరైన లబ్ధిదార్లకు ఎన్ని పని దినాలు కల్పించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకుల పని తీరుపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో ఉపాధి ఏపీఓ సునీల పాల్గొన్నారు.

చురుగ్గా 'ఆరోగ్య సురక్ష' సర్వే



బీపీ చెక్ చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, సిబ్బంది

తెర్లాం: మండలంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా కొనసాగుతుంది. బుధవారం తెర్లాంతో పాటు పలు గ్రామాల్లో సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరించారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యాధికారులు రెడ్డి శ్రీనివాసరావు, మాధవి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు డిమాండ్

రామభద్రపురం: తప్పుడు మస్తర్లు వేస్తూ అవినీతికి పాల్పడుతున్న రామభద్రపురం గ్రామం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి హామీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేరులతో బుధవారం ఆయన మాట్లాడారు. సుమారు 40 మంది రామభద్రపురం గ్రామ వలంటీర్లు ఉపాధి హామీ పనులకు వెళ్లకపోయినా వారి పేరిట మస్తర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్ నిధులు డ్రా చేసి అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆయన వెంట పలువురు ఎంఆర్‌పీఎస్ సభ్యులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండల పరిధిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.కొత్తవలస-1, కొత్తపేట-2లో ఆయా పోస్టులు, మద్దివలసలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు సంబంధించి ఖాళీలున్నాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు అక్టోబర్ 5లోగా రాజాం ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. రోస్టర్ పద్ధతిలో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు.

బై బై గణేశా..



బాడంగి: వినాయక విగ్రహం ఊరేగింపు



బాడంగి: ముగడ కాలనీలో బిందెల నృత్యాలు

బాడంగి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన శివ గణపతితో పాటు ముగడ కాలనీకి చెందిన వినాయక నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిని డ్యాన్స్‌లు, కోలాటం వంటి నృత్య కళారూపాలతో పాటు భద్రకాళి వంటి రూపకాలను ప్రదర్శించారు. బిందెల డ్యాన్స్‌లు, కాళీమాత రూపకాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎస్‌ఐ జయంతి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బంకు యజమానిపై చర్యలకు డిమాండ్



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుడి తల్లి, కుటుంబ సభ్యులు

బొబ్బిలి: పెట్రోల్ బంక్‌లో ట్యాంకును క్లీన్ చేసేందుకు లోనికి దిగి విష వాయువు ప్రభావంతో మృతి చెందిన చింతాడ గ్రామానికి చెందిన పోలినాయుడు, పాట్నాకు చెందిన అజిత్ కుమార్‌ల మరణానికి కారకులైన బంకు యజమాని సత్యనారాయణరెడ్డిపై కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయాలని అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోరు సాంబయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడి పెట్రోల్ బంకు, ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడారు. ఇరు కుటుంబాలకు సమాన న్యాయం చేయాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒకొక్కరికి ఒక్కోలా పరిహారం ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని కోరారు.

బోరుమన్న కుటుంబ సభ్యులు

కూలి పని కోసం వస్తే ప్రాణాలు పోయాయా అని ఆస్పత్రిలో రోదించిన పాట్నాకు చెందిన అజిత్ కుమార్(అన్ను)తల్లి అంజుదేవి రోదనలు చూపరులకు కంటతడి పెట్టించాయి. మూడు రోజుల ప్రయాణం తరువాత 18ఏళ్ల తన కుమారుడి మృతదేహాన్ని చూసేందుకు బుధవారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులంతా బొబ్బిలి వచ్చారు. పెళ్లికాని ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మంచం బారిన పడ్డ భర్త గుర్చి ఆమె గుండెలవిసేలా రోదించడం చూసిన స్థానికులు కంట తడి పెట్టుకున్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

రాజాం: పట్టణంలోని విద్యానగర్, వరలక్ష్మీనగర్‌లోని వినాయక మంటపాల వద్ద కాలనీకి చెందిన ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులను బుధవారం కమిటీ సభ్యులు సత్కరించారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అదపాక దామోదరరావుతో పాటు జిల్లా ఉత్తమ పోలీస్ ఉద్యోగిగా అవార్డు పొందిన హెడ్ కానిస్టేబుల్ నెలిరొతు చంద్రినాయుడులను జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో పొగిరి సురేష్ బాబు, జి.తవిటినాయుడు, పొగిరి విశ్వనాథం, సంగంనాయుడు, సాయిరాజ్, సుమన్, సుధీర్, సింహాచలం, సత్యనారాయణ, శ్రీను, ఆర్.శ్రీను, పెంకి భూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

నవదుర్గ ఆలయ హుండీల ఆదాయం రూ. 3.39 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

రాజాం సిటీ: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గల నవదుర్గ ఆలయ హుండీ ద్వారా 3,93,483 రూపాయల ఆదాయం సమకూరిందని ఈఓ పి. శ్యామలరావు తెలిపారు. ఆలయ ఆవరణలో ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పర్యవేక్షకుడు బీవీ మాధవరావు సమక్షంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించామన్నారు. 112 రోజులకు గాను రూ. 3.93 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు రామాయణం శ్రీనివాసశర్మ, ఆర్.రామచంద్రరావుశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



వైద్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని ఖండ్యాం ఆయుర్వేద కేంద్రం డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కొమెరలో బుధవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి తనిఖీలు చేపట్టి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడి లక్షున్నాయుడు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులు మరింతగా రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు

బొబ్బిలి: నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులంతా జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది బొబ్బిలి పేరు ఇనుమడించేలా రాణించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాల నాయుడు అన్నారు. మండలంలోని పారాది జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సర్పంచ్ జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు, నియోజకవర్గంలోని 30 మంది పీడీలు పాల్గొని కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నీ కాయింట్, జట్లను ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని 30 మంది పీడీలు పాల్గొన్నారు.

వంగర విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమణమ్మ

వంగర: విద్యాశాఖ ఆధ్వర్యంలో వారధి ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పాలవలస యామిని, గొట్టాపు గుణశ్రీ, శివ్వాపు దివ్య జట్టుగా వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం విడుదలైన రాష్ట్ర స్థాయి ఫలితాల్లో వంగర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

క్రీడా దుస్తుల అందజేత



క్రీడా దుస్తుల్లో విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం పాఠశాల విద్యార్థులకు సింగపూర్‌లో ఉంటున్న మల్లెల నవీన్ రూ. 20 వేల విలువ చేసే క్రీడా దుస్తులు, క్రీడా సామాగ్రిని స్నేహితుడు లెంక జగన్ ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్జ వెంకటరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మల్లెల నవీన్‌కు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, మల్లెల నవీన్ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

ఆర్పీలపై చర్యలు తీసుకోవాలి

- పొనుగుటివలస డ్వాక్రా మహిళలు



పొనుగుటివలస సచివాలయం వద్ద రిలేదీక్షలు చేపడుతున్న మహిళలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘాల్లో అవకతవకలకు పాల్పడి గ్రూపులను తప్పుదోవపట్టించిన ఆర్పీలు ఎస్.ఉమాదేవి, పి.సంధ్యలపై చర్యలు తీసుకోవాలని మహిళలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ మేరకు గ్రామంలోని సచివాలయం వద్ద బుధవారం నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాహా చేసిన సొమ్మును పూర్తిస్థాయిలో ఆర్పీల నుంచి రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో సుమారు 90 గ్రూపులు వరకు ఉన్నాయని.. అన్ని గ్రూపుల్లో అవకతవకలు జరిగాయని తెలిపారు. తమకు తెలియకుండా ఆర్పీలు లక్షల రూపాయల్లో రుణం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు పాస్ పుస్తకాలు సైతం ఆర్పీల వద్ద ఉంచుకోవడంపై మండిపడ్డారు. బ్యాంకు అధికారులు, మెప్మా అధికారుల తీరుపైనా కూడా అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి ఆర్పీలపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేసేంత వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ర్యాలీగా స్టేట్‌బ్యాంకు వద్దకు....

రిలే దీక్ష నుంచి మహిళలంతా రాజాం స్టేట్‌బ్యాంకు వద్దకు ర్యాలీగా చేరుకుని బ్యాంకు ముందు బైఠాయించి ఆందోళన చేశారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రావాలని పట్టుబట్టారు. సంఘాల సభ్యుల ప్రమేయం లేకుండా ఎలా రుణాలు మంజూరుచేశారంటూ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న



బ్యాంకు వద్ద మహిళలకు నచ్చజెబుతున్న పోలీసులు

రాజాం ఏఎస్సైలు అల్లు లక్షున్నాయుడు, ఆర్.రమణమ్మ, సంతకవిటి ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావులతో పాటు సిబ్బంది బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకారులతో సంప్రదింపులు చేపట్టారు. ఫీల్డ్ ఆఫీసర్, బ్యాంకు మేనేజర్ల హస్తం లేకుండా ఇంత పెద్దమొత్తంలో రుణాలు ఎలా మంజూరు చేశారో తమకు తెలపాలని ఆందళనకారులు డిమాండ్ చేశారు. ఇంతలో బ్యాంక్ సిబ్బంది కలుగజేసుకుని మేనేజర్‌తో మాట్లాడేందుకు కొంతమంది బ్యాంక్ లోపలకు రావాలని కోరగా.. బీఎం బయటకు వచ్చి సమాధానం చెప్పాలని మహిళలు పట్టుబట్టారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని మేనేజర్ మూర్తిని బయటకు రప్పించి సభ్యులతో మాట్లాడించారు. స్టేట్‌మెంట్లు కావాలని అడిగితే అందరి సంతకాలు ఉండాలని చెప్పిన ఫీల్డ్ ఆఫీసర్... సభ్యుల ప్రమేయం లేకుండా ఎలా రుణాలు మంజూరు చేశారని మేనేజర్‌ను నిలదీశారు. నిధుల స్వాహాపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని బీఎం తెలిపారు.

'గడప గడప'కు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాలకు పనులు మంజూరు చేసిందని, ఆ పనులు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీలను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యేలా సచివాలయ ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తయినంతవరకు ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ వేలి ముద్ర వేయాల్సిందేనని, ఎటువంటి సెలవులు ఇవ్వడం జరగదన్నారు. సచివాలయాల్లో సిటిజన్ సర్వీసుల ద్వారా వచ్చే నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాలో జమ చేసేలా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కోరారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వేకు సహకరించాలి



రాజయ్యపేటలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజాం: గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బొద్దాం పీహెచ్‌సీ డాక్టర్ సిద్ధేశ్వరి అన్నారు. మండలంలోని బొద్దాం, పెనుబాక, రాజయ్యపేట, కంచరాం గ్రామాల్లో బుధవారం చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ఇళ్లకు వచ్చిన వైద్యసిబ్బందికి ఆరోగ్యపరమైన సమస్యలను తెలియజేయాలని సూచించారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు సుగర్, బీపీ టెస్టులు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, హెచ్‌ఈలు, హెచ్‌ఎస్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ తదితరులు

బొబ్బిలి: మండలంలోని జగన్నాధపురం సచివాలయం పరిధిలోని కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ పోతుల రవికుమార్, ఈఓఆర్‌డీ అల్లు భాస్కరరావు, కార్యదర్శి మురళి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫలితాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

మహాజన సభ వాయిదా



మహాజన సభకు హాజరైన సభ్యులు

బొబ్బిలి: ది బొబ్బిలి సుగర్ కేన్ గ్రోయర్స్ కోఆపరేటివ్ సొసైటీ బుధవారం నిర్వహించిన మహాజన సభ కోరం లేకపోవడంతో వాయిదా పడింది. సొసైటీలో అర్హత ఉన్న 104 మందిలో కోరం కోసం 34 మంది హాజరు కావాల్సి ఉంది. కానీ కేవలం 11 మంది మాత్రమే హాజరు కావడంతో బొబ్బిలి, సాలూరు డివిజినల్ కోఆపరేటివ్ అధికారులు రామకృష్ణ, జ్యోతి లక్ష్మి తదితరులు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తిరిగి సభను నవంబర్‌లో ఎప్పుడు నిర్ణయించేదీ తెలియజేస్తామని వారు చెప్పారు.

సంక్షిప్తంగా...

ఆధ్యాత్మిక భావాలు తప్పనిసరి

రేగిడి: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్మాత్మిక వక్త ఎన్‌వీ రమణ అన్నారు. రేగిడి గ్రామంలోని విశ్వసాయి మందిరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భారతీయ సంస్కృతి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, లావేటి విష్ణు, లావేటి భూతల్లి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన తహసీల్దార్



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

బొబ్బిలి: ఆర్డీఓ పి.శేష శైలజ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని 55, 56 పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ డోల రాజేశ్వర రావు, ఎన్నికల డీటీ శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. అంతకు ముందు ఆర్డీఓ కార్యాలయంలో పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల జాబితాలో చేర్పులు, మార్పుల, సవరణల వివరాలను వారికి అందజేశారు.

30 వరకు వెటర్నరీ కోర్సులకు కౌన్సెలింగ్

బొబ్బిలి: మండలంలోని పిరిడి వద్ద గల గోకుల్ ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లొమో ఇన్ వెటర్నరీ కోర్సులకు ఈ నెల 30తో కౌన్సెలింగ్ ముగుస్తుందని ఎండీ బొట్ట వెంకట రమణ తెలిపారు. అర్హులయిన విద్యార్థులు కళాశాల పని వేళల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలుండే ఈ కోర్సుకు పదో తరగతి, ఇంటర్ కోర్సు నిలిపివేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9182840072, 6301624988 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో పుట్టలో వెలసిన అయ్యప్పస్వామికి బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామ పురోహితుడు రేజేటి సత్తిబాబు శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ



రైతుల నుంచి వేలి ముద్రలు సేకరిస్తున్న సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని గొర్లె సీతారామపురంలో గ్రామంలో ఇటీవల పూర్తయిన సర్వే ప్రాప్తికి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు పర్యవేక్షణలో రైతుల నుంచి వేలిముద్రలు సేకరించి పుస్తకాలను అందజేశారు.

గ్రామ పంచాయతీలు స్వచ్ఛంగా ఉండాలి

బొబ్బిలి: గ్రామ పంచాలతీలు, ఇళ్లు, ఇంటి పరిసరాలు స్వచ్ఛంగా ఉండాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అరసాడ శంకరరావు అన్నారు. మండలంలోని మెట్టవలసలో చెత్తబుట్టలను ఇంటింటికీ వెళ్లి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి గోపాలపురం గ్రామానికి చెందిన దీసరి గణపతి, కొత్తవలస గ్రామానికి చెందిన బట్న వంశీ పరస్పరం దాడి చేసుకున్న సంఘటనపై ఎస్సై పి.నీలావతి బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బట్న నర్సింహులు తనకు డబ్బులు బాకీ అని, అవి అతని కుమారుడైన వంశీని అడిగేందుకు వెళ్లగా దాడిచేసి గాయపర్చాడని గణపతి అనే వ్యక్తి ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై గణపతి దాడి చేసినట్లు వంశీ కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.